# కథ

# వర్ధనమ్మ మనసు

వి.సత్యవతీదేవి

**"పోస్ట్"**

**రాత్రి వంట కోసం చేటలో బియ్యం పోసుకొని వరండాలో కూర్చొని ఏరుకుంటున్న వర్ధనమ్మ ఆ కేక విని చేటలో బియ్యం అక్కడే పెట్టి లేచి గబగబ వీధిలోకి వచ్చింది. అప్పటికే అక్కడ కవరు పడేసి వెళ్లిపోయాడు పోస్ట్‌మేన్.**

కవరు చేతిలోకి తీసుకొని అటుఇటు తిప్పి చూసింది. చేతివ్రాత చూస్తే కూతురిదిలాగే ఉంది. వర్ధనమ్మ మనసు బాధతో మూల్గింది. అమ్మాయేం రాసిందో.. తనకా చదువు రాదు. ఏదో ఒకటో, రెండో అక్షరాలు పోల్చుకలదు గానీ చదవడం, రాయడం తనకి చేతకాదు.

కొడుకు శంకరం, కోడలు మాలతి ఇద్దరూ ఉద్యోగస్తులే అవ్వడం వల్ల వాళ్ల వాళ్ల ఉత్తరాలు సాధారణంగా వాళ్ల ఆఫీసులకే వస్తాయి. అప్పుడప్పుడు అల్లుడు బావమరిది పేర ఆఫీసుకే ఉత్తరాలు రాస్తాడు. శంకరానికి బుద్ధి పుడితే ఆఫీసు నుంచి రాగానే అమ్మాయి వాళ్ల బావగారు ఉత్తరం రాశారు అంతా కులాసాగా ఉన్నారట అంటాడు. వాడికి అక్కడ నుంచి వచ్చిన ఉత్తరాలెన్నో, తనకి ఎన్నిటి గురించి చెబుతున్నాడో ఆ భగవంతుడికే తెలియాలి.

ఏ సంవత్సరానికో, ఆర్నెల్లకో మాత్రం తన కూతురు లలిత తన పేర ఇంటికి ఉత్తరం రాస్తుంది. అదీ అమ్మ తృప్తి పడుతుందని. అమ్మకి చదువు రాదని దానికీ తెలుసు. ఎవరి చేతనైనా చదివించుకొంటుందిలే అని తన పేర రాస్తుంది వెర్రి పిల్ల.

ఆ ఉత్తర్వమైనా మురిపించి మురిపించి మరీ చదువుతారు. ఇద్దరూ ఒక్కలాంటి వాళ్లే. ఎప్పుడడిగినా వాళ్లకి తీరుబాటు ఉండదు. పొద్దున్న అడిగితే సాయంత్రమంటారు. సాయంత్రం అడిగితే రాత్రంటారు. పోనీ ఉత్తరం అంతా చదువుతారా అంటే అదీ లేదు. పై నుంచి కిందదాకా ఒకమారు చూసి సారాంశం మాత్రం తనకి చెబుతారు. తనకది తృప్తిగా ఉండదు. శ్రీరామా మొదలు చిత్తగించవలెను వరకు తనకు వినాలని ఉంటుంది.

ఏ మధ్యాహ్నమో వచ్చిన ఉత్తరాన్ని సాయంకాలం కోడలు వచ్చి టీ ఫ్లాస్కులోది వంపుకొని తాగాక మెల్లిగా వెళ్లి లలిత దగ్గర నుండి ఉత్తరం వచ్చింది కాస్త చదివిపెట్టమ్మా అంటుంది. ''ఇప్పుడేగా వచ్చింది. అంత తొందరెందుకు మళ్లీ రేపు పది గంటల దాకా ఇంట్లోనే పడి చస్తానుగా'' ఇదీ కోడలి సమాధానం.

కాస్సేపయిన తరువాతేనా ఉత్తరం తెండి చదువుతాను అనదు. మళ్లీ అడగటానికి తనకి భయం. ఎనిమిదయితే కొడుకు శంకరం వస్తాడు. రాగానే భార్యతో ముచ్చట్లేసుకుంటాడు. ఉండబట్టలేక ఉత్తరం తీసుకెళ్లి చెల్లి దగ్గర నుంచి ఉత్తరం వచ్చింది కొంచెం చదివి పెట్టరా అంటే, ఉండమ్మా స్నానం చేసి వస్తాను అంటాడు. ''నేను చదివి పెడతానంటే ఆవిడగారికి పాపం తొందరెక్కువై మిమ్మల్ని అడుగుతోంది. మీరే చదవండి'' అంటూ వ్యంగోక్తులు విసురుతుంది కోడలు. స్నానం చేసి వచ్చి భార్యాభర్తలిద్దరు టీవీ ముందు కూలబడ్డారంటే పదిదాకా లేవరు. రెండుపూటలా వంటవాళ్లు, కాఫీ, టిఫిన్లు అంతా తనదే బాధ్యత అవటం వల్ల కోడలుకే పని ఉండదు తిన్న కంచాలు కడగడం తప్ప. ఉద్యోగస్తురాలామె మరీ. మళ్లీ తను ఉత్తరం పట్టుకెళ్లి వాడి ముందు దీనంగా నిలబడితే ఇక తప్పదన్నట్లు లోన చదువుకొని సారాంశం మాత్రమే చెబుతాడు. ఎప్పుడోకానీ కూతురి దగ్గర నుంచి తనకి రాని ఉత్తరం చదివించుకోందుకు ఇన్ని పాట్లు పడాలి.

అంత రెండు పేజీల ఉత్తరాన్ని అర నిమిషంలో వాళ్లు తనకి చెప్పేస్తే తనకి తృప్తేది? పోనీ ఇరుగుపొరుగు వాళ్లెవరిచేతనైనా చదివించుకొందామంటే, ఒకసారిలాగే బుద్ధి తక్కువయి ఆత్రం పట్టలేక పొరుగింటి వెంకటరత్నం చేత చదివించుకుంటే కోడలికెలా తెలిసిందో ఏమో ''ఏం ఇంట్లో చదువుకొన్న వాళ్లెవరు లేరా! అడ్డమైన వాళ్ల చేత ఉత్తరాలు చదివిస్తున్నారు. మన సంగతులు అందరికీ తెలియాలా'' అంటూ ఒంటికాలి మీద లేచింది.

'అమ్మ పెట్టాపెట్టదు. అడుక్కోని తినానివ్వదు' అనే సామెత గుర్తుకొస్తూ ఉంటుంది వర్ధనమ్మకి.

తనకే చదువొచ్చి ఉంటేనా.. వీళ్లందరిని బ్రతిమాలుకోనేదా.. వారానికొక ఉత్తరం కూతురికి రాసుకోనేది కాదూ.

వర్ధనమ్మ మనసు గతంలోకి వెళ్లిపోయింది. నాన్న భూస్వామి, అమ్మ గృహిణి. ఇద్దరు మగపిల్లల తరువాత తను. తన ఐదేళ్ల వయసులో అన్నలిద్దరూ తెల్లటి బట్టలేసుకొని, స్కూలు బేగులు భుజానికి తగిలించుకొని స్కూలుకెళుతూ ఉంటే తనకి కూడా బడికి వెళ్లాలని ఉండేది. ఎక్కడి నుంచో ఒక చిరిగిపోయిన పాత బేగ్‌ను అంకించుకొని అందులోనే రెండు పాత పుస్తకాలు కుక్కి విరిగిపోయిన పలక ముక్కతో సహా వాళ్ల వెంట బడికొస్తానని వెంటబడేది.

అమ్మా..చూడవే.. ఇది మా వెంటపడుతోంది అని ఇల్లెగిరిపోయేటట్టు వాళ్ల కేకలు పెట్టేవారు. ఇంతలో అమ్మ వంటింటిలో పరుగెత్తుకొచ్చి ''రావె వర్ధనీ నీకెందుకు వాళ్లతో. నీకు మంచి తాయిలం పెడతానురా'' అంటూ వంటింటిలోకి లాక్కుపోయేది.

ఓపికున్నంతసేపు కాళ్లు చేతులు నేలకేసి కొట్టి కొట్టి దొర్లి దొర్లి ఏడ్చి ఓదార్చే వాళ్లు లేక నీరసం వచ్చి తనంతట తనే లేచి కూర్చునేది.

కొద్దిగా ఊహ తెలిశాక ''చదువుకొంటాను నాన్నా'' అని తండ్రిని భయం భయంగా అడిగితే..

''నీకెందుకే చదువు. అమ్మ దగ్గర పని నేర్చుకో. రేపు అత్తారింట్లో సుఖపడుదువుగాని'' ఇది నాన్న ఉవాచ.

అమ్మకి తనని స్కూలుకి పంపాలనే ఉండేది. కానీ నాన్నే పడనివ్వలేదు. ''పోనీండి అది సరదా పడుతోంది. ఊళ్లోనే ఆడపిల్లల స్కూలు ఉంది కదా. ఐదో తరగతి వరకేనా చదివిద్దాం'' అంటే నాన్న పులిలా గాండ్రించి నోరెత్తావంటే చంపేస్తాను. ఆడపిల్లను చదివించడం మా ఇంటా వంటా లేదు. అని గదమాయించేసరికి అమ్మ మరి నోరెత్తలేదు.

అన్నయ్యలను బ్రతిమాలగా, బ్రతిమాలగా తనకి అమ్మ పెట్టిన తాయిలాన్ని వాళ్లకే ఇస్తానని ఒప్పందం చేసుకొన్న మీదట నాన్న వాళ్ల కప్పుడప్పుడు ఇచ్చిన డబ్బులతో ఒక పలక మాత్రం కొని తెచ్చి ఇచ్చి మురిపించుకొని మురిపించుకొని రెండక్షరాలు మాత్రం నేర్పారు. వాళ్లకి కావల్సిన పనులన్నీ తనే చేసి పెట్టేది. అయినా క, ఖలు దాటలేదు.

పదమూడేళ్లొచ్చేటప్పటికే సదాశివంతో పెండ్లయిపోయింది. భర్త సహకారంతోనైనా చదువుకోవాలన్న బలమైన కాంక్షతో అత్తవారింట్లో అడుగు పెట్టింది వర్ధని. ఆ కోరిక నెరవేరుతుందన్న ఆశతోనే తాను పదిలంగా దాచుకొన్న పలకను కూడా తన బట్టల పెట్టె అడుగున భద్రంగా పెట్టి తనతో తెచ్చుకొంది.

భర్త మంచివాడే కానీ ఏం లాభం. ఉదయం ఐదు గంటలకి లేచింది మొదలు రాత్రి పది గంటల

వరకు తనకు ఇంటి చాకిరితోటే సరిపోయింది. అంత చిన్న వయసులోనే అనారోగ్యంతో ఉన్న అత్తగారు, చదువుకొంటున్న ఇద్దరు మరుదులు, పెండ్లికెదిగిన ఆడపడుచు, వీళ్లందరి బరువు బాధ్యతలు తన భుజస్కంధాలపైనే పడ్డాయి.

వ్యవసాయదారుడైన తన భర్త తన ఇంటి వ్యవహారాల జోలికి పోక ఊళ్లో వ్యవహారాలన్నీ తనవే అనేవాడు. అందరి తగవుల్లోను తనే, ఉచిత సలహాలివ్వడంలోనూ ఘనుడే. సదాశివం లేకపోతే ఊళ్లో వ్యవహారాలన్నీ నిలిచిపోతాయి అనేటట్టు ఉండేవాడు. ఊళ్లో వ్యవహారాలన్నీ చక్కబెట్టుకొని ఏ రాత్రి పదిగంటలకో ఇల్లు చేరితే, స్నాన భోజనాదులు కానించి తన అవసరాలు తీర్చుకుని గుర్రు పెట్టి నిద్రపోయేవాడు. ఇంక వర్ధనికి చదువెక్కడిది. ఇంట్లో చదువుకుంటున్న మరదలున్న వాళ్లకి తాను చాకిరి చేయడానికేగానీ మరెందుకు పనికొచ్చేది కాదు. ఆడపడుచు తల్లి దగ్గర కూర్చుని కబుర్లు చెప్పడం వరకే ఆవగింజంత సాయం అక్కడి నుండి లేదు.

ఈ పరీక్షల్లోనే వర్ధని ఇద్దరు బిడ్డల తల్లయింది. వర్ధని అల్లా వర్ధనమ్మ అయింది. మరదులకి ఆడపడుచుకి పెళ్లిళ్లు అయ్యాయి. కొడుకు శంకరంతో పాటు కూతురు లలితను కూడా బడికి పంపించింది. భర్త అవును అనలేదు కాదు అనలేదు. అత్త మాత్రం కాసేపు గొణిగింది. వర్ధనమ్మ పట్టించుకోలేదు.



అయితే ప్రయోజనం ఏమిటి? లలిత ఎనిమిదో తరగతిలోకొచ్చేటప్పటికే అత్తగారి ఆరోగ్యం క్షీణించడం మనవరాలి పెళ్లి చూస్తేనే కానీ ప్రాణం పోదంటే అప్పటికప్పుడు సంబంధం చూసి పెళ్లి చేసేశారు. లలితను పెట్టి చదువు చదివించాలన్న కోరిక కూడా తీరలేదు. తాను నిమిత్తమాత్రురాలయిపోయింది. అత్తగారు దాటిపోయింది.

శంకరం పెద్దచదువులు చదివాడు. ఉన్న ఊళ్లోనే ఉద్యోగం. కొడుకు మొదటి సంపాదనైనా అనుభవించకుండానే మారాజు వెళ్లిపోయాడు. తల్లికొడుకులిద్దరు ఒకరికొకరై నిలిచారు. అయితే తండ్రి పోయిన ఏడాదైనా తిరగకుండానే మాలతి అనే అమ్మాయిని రిజిస్టరు మేరేజ్ చేసుకొని తీసుకొచ్చి ఇదిగో నా భార్య అంటూ అమ్మకి చూపించాడు. కోడలు ఉద్యోగస్తురాలే. సరే. కొడుకిష్టం అంటూ సరిపెట్టుకొంది. కోడలు చదువుకొన్నదే కానీ తనని పురుగు కంటే హీనంగా చూస్తుంది. ఏడాదికొక మారైనా ఆడపడుచుని పిలిచి పసుపు కుంకుమ ఇవ్వాలన్న ఆలోచనే ఆమెకి రాదు. తానెప్పుడైనా ఆ మాటంటే ఇక్కడేం మడులు మాన్యాలు ఉన్నాయా అంటుంది. మీ మామగారి ఇల్లు, రెండెకరాల పొలం వాడి పేరే ఉన్నాయి కదమ్మా- అంటే ఆ .. ఇచ్చారులే.. బోడి ఆస్తి అంటుంది. కొడుకు చూస్తూ ఊరుకొంటాడే కానీ మాట్లాడడు.

''ఏమిటండీ పిన్నిగారూ.. చేతిలో ఉత్తరం పట్టుకొని దీర్ఘాలోచనలో ఉన్నారు. ఎవరు రాశారేమిటి?'' అంటూ పక్కింటికి శారద వచ్చి తట్టేవరకు గతంలోనే ఉండిపోయింది వర్ధనమ్మ. శారద స్పర్శతో వర్తమానంలోకి వచ్చిన వర్ధనమ్మ ''నువ్వా శారదా.. మా అమ్మాయి లలిత దగ్గర నుండి వచ్చినట్టుందమ్మా'' అంది మళ్లీ కవరు అటూ ఇటూ తిరగేస్తూ.

''అయ్యో ఇంకా చింపనే లేదా అవునూ.. మీకు చదువు రాదు కదూ.. నేను చదివిపెడతా ఇటివ్వండి'' అంది చనువుగా.

''శారద పక్కింటి వాళ్ల పోర్షనులో రెండు నెలల క్రితమే అద్దెకు దిగింది. టీచరు పోస్టులో చేరింది. తల్లి అక్క చెల్లెలు పక్క ఊరిలో ఉంటారు. తండ్రి లేడు. చనువుగా వర్ధనమ్మ దగ్గరకి అప్పుడప్పుడొచ్చి ఏ కూర ఎలా వండాలో నేర్చుకుంటూ ఉంటుంది.

''వర్ధమ్మా... ఎవరిచేతనైనా చదివించుకొన్నానని తెలిస్తే మీ కోడలు ఊరుకోదు. వాళ్లకిచ్చాక చదివించుకొంటాలే'' అంటూ ఉత్తరాన్ని వెనక్కి పెట్టుకుంది.

శారదకి వీళ్లింటి సంగతులు చూచాయగా తెలుసు. ''ఎందుకండీ అంత భయపడతారు...'' అంటూ చేతిలో ఉత్తరం తీసుకొని చింపింది.

''అమ్మా

ఇక్కడంతా బాగున్నాం. మీరందరూ బాగున్నారని తలుస్తాను. ఈ మధ్య మీ అల్లుడుగారు అన్నయ్య పేర రెండు, మూడు ఉత్తరాలు రాశారు. కానీ ఒక్కదానికీ సమాధానం లేదు. ఎలా ఉన్నారో అని మాకాందోళన. నీ ఆరోగ్యం బాగుందా! అమ్మా నిన్ను చూడాలని ఉంది. నిన్ను చూసి అప్పుడే నాలుగు సంవత్సరాలయింది. ఎన్నిమార్లు నిన్ను పంపించమని రాసినా అన్నయ్య చూద్దాంలే అని రాస్తాడు. నిన్ను పంపితే అక్కడ వదిన చాలా ఇబ్బంది పడుతుందట. కన్నతల్లివి నిన్ను చూడాలని నాకు ఉండదా అమ్మా.. నన్నెలాగ అక్కడికి పిలవడు.. నిన్నైనా పంపితే నాలుగు రోజులు ఉంటావుకదా. నీ మనవలు నిన్ను కలవరిస్తున్నారు. అసలు మా ఉత్తరాలు మీకందుతున్నాయా లేదా? అన్నయ్యలాగే నేనూ పుట్టాను. నా దగ్గర కూడా నువ్వు ఉండచ్చు. నేనేమో వాడి దగ్గర నుంచి మడులు మాన్యాలు అడగలేదు. కేవలం క్షేమసమాచారాలే.. వెంటనే జవాబు రాయించు. నువ్వు రావడానికి ప్రయత్నించు.

ఇట్లు

నీ కూతురు

లలిత''

వర్ధనమ్మ కంట్లో నీరుబికింది. ఈమధ్య వాళ్ల దగ్గర నుంచి ఉత్తరాలేవీ వచ్చినట్టు తనతో చెప్పలేదు. హు.. శంకరం ఎంత స్వార్థపరుడుగా తయారయ్యాడు. రెండు పూటలా వంటావార్పు, కాఫీ, టిఫిన్‌లతో సహా సాయంకాలం కోడలు వచ్చేటప్పటికి ఫ్లాస్కులో టీ పోసి రెడీగా ఉంచుతుంది. తనని కూతురింటికి పంపిస్తే ఈ పనులన్నీ చేసుకోవడానికి ఈమెకి వళ్లు వంగుతుందా.. అందుకే తనని పంపమని చెల్లెలు రాసిందని శంకరం చెప్పలేదు. తనెక్కడ ప్రయాణం అయిపోతుందోనని. పోనీ ఆడపిల్లని పిలిచి ఏడాదికొకసారయినా ఇంత పసుపు, కుంకుమ పెడతారా అంటే అదీ లేదు.

వర్ధనమ్మ ఆలోచనల్లో ఉండగానే వెళ్లొస్తా పిన్నిగారూ అంటూ శారద నాలుగడుగులు ముందుకేసి మళ్లీ వెనక్కి వచ్చి ''పిన్నిగారూ'' అని పిలిచింది.

వర్ధనమ్మ వెనక్కి తిరిగి చూసింది 'ఏమిటన్నట్లు.'


''నేనొక మాట చెబుతాను. ఏమీ అనుకోకండి. నేనెలాగు స్కూలు నుంచి పావు తక్కువ నాలుగుకే వచ్చేస్తాను. మీ కోడలూ ఆరు గంటల దాకా రాదు. మీరు నాలుగు గంటలకొచ్చి ఒక్క గంట అంటే ఐదు వరకూ చదువుకో రాదూ.. నేను మీకు అక్షరాలు, గుణింతాలు అన్నీ నేర్పి ఆరు నెలల్లో మిమ్మల్ని ఉత్తరాలు చదవడం, రాయడం చేతనయ్యేటట్టు చేస్తాను. చక్కగా కాలక్షేపంగా ఏమైనా మంచి పుస్తకాలు కూడా చదువుకోవచ్చు. రాత్రి మళ్లీ పడుకోబోయే ముందు ఒక్క గంట మళ్లీ కృషి చేస్తే చాలు. ఏమంటారు?'' అంది వర్ధనమ్మ ముఖంలోకి చూస్తూ.

శారద మాటలు విన్న వర్ధనమ్మ గుండె ఒక్కసారి దడదడ కొట్టుకొంది. ''ఈ వయసులోనా?'' అంది ఆశ్చర్యపోతూ.

''అదేంటి పిన్నిగారూ చదువుకి వయస్సేమిటి? అయినా మీకింకా 50 దాటి ఉండవులా ఉంది'' అంది నవ్వుతూ.

''మా కోడలికి తెలిస్తే?'' మరో సందేహం వెలిబుచ్చింది వర్ధనమ్మ.

''ఏమిటండీ అంత భయపడతారు. తెలిసే అవకాశం లేదు. ఒకవేళ తెలిసిందనుకోండి ఇదేం తప్పు పని కాదు. ఇంటి పనికి ఆటంకం రాదు. భయపడుతున్నంతకాలం ఎవరైనా భయపెడతారు. తెగిస్తే ఏమీ లేదు''



ఆ మాటతో అర్జునుడికి శ్రీకృష్ణభగవానుడు గీతోపదేశం చేసినట్టు అయింది.

''రేపటి నుంచే వస్తాను శారదమ్మా. నా తల్లే.. నా బంగారుతల్లి. ఎంత చక్కటి మాట చెప్పావమ్మా'' అంది మెరిసే కళ్లతో.

రాత్రి పడుకుంటే అవే కలలు. తాను శారద దగ్గరకి చదువుకొందుకు వెళుతున్నట్టు. నాలుగు రోజులకే పుస్తకం చదివేస్తోందట. మీ చేత బి.ఎ, ఎం.ఎ. కట్టించేస్తానంటోందిట శారద. కొడుకు, కోడలు సంగతి తెలిసి తనతో జగడం వేసుకొన్నారట. తను వాళ్లతో దెబ్బలాడుతోందట. ''నేను చదువుకొంటూ ఉంటే మీకేంటి బాధ? మీ పనులకేమైనా ఆటంకం కలుగుతోందా.. లేక భారం మీ మీద ఏమైనా పడుతోందా'' అని గట్టిగా అరుస్తోందట.

తెలివొచ్చిన తరువాత తానేనా అలా వాదించింది అని ఆశ్చర్యపోయింది.

★ ★ ★

తెల్లవారింది. ఏ రోజూ లేని ఉత్సాహం ఉరకలు వేస్తోంది ఆ రోజు వర్ధనమ్మలో. చకచకా పనులు చేస్తోంది. సాయంకాలం నాలుగు కోసం ఎదురుచూస్తోంది. తన పుట్టింటి నుంచి అత్తవారింటికొచ్చినప్పుడు తెచ్చిన పెట్టె తెరిచింది. భద్రంగా అందులోంచి పలక తీసింది. తడిగుడ్డ పెట్టి రెండు మూడుమార్లు తుడిచింది. ఠంగున నాలుగు కొట్టగానే పలక చేత బట్టుకొని ఆత్మవిశ్వాసంతో శారద ఇంటివైపు అడుగులు వేసింది వర్ధనమ్మ.

## రాఖీతో రాఖీ కానుక

**జూనియర్ ఎన్టీఆర్-ఇలియానా జంటగా కృష్ణవంశీ రూపొందిస్తున్న 'రాఖీ' సినిమా ఆడియో కాసెట్‌తోపాటు ఓ రాఖీని కూడా గిఫ్ట్‌గా ఇవ్వాలని ఆ సినిమా ఆడియోని రిలీజ్ చేస్తున్న కంపెనీ అనుకుంటోందిట. అన్నాచెల్లెళ్ల అనుబంధం సబ్జెక్ట్ కాబట్టి ఈ సినిమా పాటలతో పాటు రాఖీని కూడా ఇస్తే మంచి పబ్లిసిటీ వస్తుందనేది వాళ్ల ఆలోచన. బాగానే వుంది. ఎన్టీఆర్‌కి చెల్లెలిగా మంజూష అనే అమ్మాయి నటిస్తోంది. అలనాటి 'రక్తసంబంధం' సినిమా సీనియర్ ఎన్టీఆర్‌కి తీసుకొచ్చినంత పేరు ఈ 'రాఖీ' జూనియర్ ఎన్టీఆర్‌కి కూడా తీసుకొస్తుందేమో!**